ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 30 డిసెంబరు 2024 | 5





క్రియ పోటీల్లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు



అర్ధనారీశ్వరుడిగా.. చిన్నారి ప్రదర్శన



తందాన..తాన.. బుర్రకథ చెప్తున్న విద్యార్థులు



బ్లాక్ అండ్ వైట్.. మైమ్ యాక్షన్‌లో..



కడవ మీద కడవ పెట్టి.. సంప్రదాయ లంబాడీ వస్త్రధారణలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన



ఆదిపరాశక్తి.. అమ్మవారి ఉగ్రరూపంలో విద్యార్థిని


'క్రియ' అదిరింది!

ఏమి ప్రదర్శనలు.. ఏమి వేషధారణలు.. ఆకట్టుకునే కట్టు, బొట్టులతో.. సంప్రదాయ వస్త్రధారణలతో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీత వాయిద్యాలు, సైన్స్ ప్రాజెక్టులు, బుర్రకథ, చిత్రలేఖనం, మైమ్ వంటి అనేక ప్రదర్శనలతో 'క్రియ' అదిరింది. విద్యార్థులు విజ్ఞానంతోపాటు వినోదాన్ని మేళవించి తమ ప్రదర్శనలతో వాహ్వా అనిపించుకున్నారు. కాకినాడ జేఎన్‌టీయూకేలో రెండోరోజూ 11వ రాష్ట్రస్థాయి క్రియ అంతర్ పాఠశాలల సాంస్కృతిక పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. వేలసంఖ్యలో చిన్నారులు తరలివచ్చి పోటీల్లో పాల్గొన్నారు. వివరాలు 7లో..



పాతాళభైరవి రా.. కపాల మాంత్రికుడి వేషధారణలో విద్యార్థి ప్రదర్శన

సై..బర్ తెగింపు!



సైబర్ క్రైం ఏడాది 2024.. ఎలా ఖాతాలోని డబ్బుపోయిందో తెలియదు.. కానీ ఖాతా ఖాళీ అయిపోతుందంతే.. రెక్కీ చేయడం.. ఇంటిని ఎంపిక చేసుకోవడం.. రాత్రి వేళల్లో కన్నం వేయడం.. దొరికింది దోచుకుపోవడం.. ఇదంతా ఓల్డ్.. కాలం మారింది.. సాంకేతికతతో కంటికి కనిపించని కేటుగాళ్లు క్షణాల్లో జనాల ఖాతాల్లోని డబ్బును ఖాళీ చేసేస్తున్నారు. సైబర్ నిపుణులకు అంతుచిక్కని విధంగా దోచుకుంటున్నారు. మరో వైపు హనీట్రాప్..ఇంకో వైపు డిజిటల్ అరెస్టులు.. ఇలా ఒకటేమిటి నేర స్వభావం తీరే మారిపోయింది.. తస్మాత్ జాగ్రత్త.. ఆద మరుపుగా ఉంటే అంతే.. ఇక రోడ్డు ప్రమాదాలు.. ఆత్మహత్యలు షరా మామూలే.. ప్రతి జిల్లాలో ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు 500 దాటాయి.. మూడు జిల్లాల్లో సుమారుగా 800 మంది వర కూ మృత్యువాత పడినట్టు సమాచారం. హత్యలు అదేస్థాయిలో పెరిగాయి.. పాతకక్షలు పడగవిప్పాయి.. ఏడాదంతా చూస్తే రక్తపాతమే.. ఏదో ఒక మూల ప్రమాదమే. ఎక్కడా ప్రశాంతత లేదు..

- సాంకేతికత తెచ్చిన కొత్త చిక్కు
- ఉమ్మడి జిల్లాలో దోపిడీలు
- కంటికి కనిపించని కేటుగాళ్లు
- హనీట్రాప్.. డిజిటల్ అరెస్టులు
- పోలీసులకు చిక్కని వైనం
- పడగవిప్పిన పాతకక్షలు
- పచ్చని తూర్పున హత్యలు
- ఆత్మహత్యలకు అంతే లేదు
- పెరిగిన రోడ్డు ప్రమాదాలు
- 800 మంది మృత్యువాత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సాంకేతిక ఏ స్థాయిలో పెరుగుతుందో సైబర్ నేరాలు అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఇవి సమాజ భద్రతకు పెనుసవాళ్లుగా మారాయి. పోలీస్ వ్యవస్థకు అంతుబట్టని విధంగా ఈ నేరాలు మారాయి. ఆన్‌లైన్ యాప్‌లు మోసాలతో అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఏవో లింక్‌లు, మెసేజ్ పంపి, వాటిని చూడానికి బ్యాంక్ ఖాతాలు ఖాళీ అయిపోతున్న ఉదం తాలు పెరిగాయి. స్టాక్ మార్కెట్ పేరిట మోసాలు జరుగుతున్నాయి. ఇటీవల డబ్బున్నవాళ్లు, అధికారులు,ఉద్యోగస్తులు, వ్యాపారులే టార్గెట్‌గా డిజిటల్ అరెస్టులు మొదలయ్యాయి. జార్ఖండ్‌లో జాంతార జిల్లా కేంద్రంగా ఇవి ఎక్కువగా జరుగుతున్నట్టు పోలీసులు పసిగట్టారు. ఢిల్లీ, నోయిడా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి డిజిటల్ అరెస్టులు జరుగుతున్నట్టు సమాచారం. జిల్లాలో కొద్ది నెలల కిందట మోరంపూడి సెంటర్ ప్రాంతంలో ఓ డాక్టర్‌కు ఫోన్ చేసి డిజిటల్ అరెస్ట్ చేసి రూ.6లక్షలు లాగేశారు. ఆఫీసర్స్ క్లబ్‌లో కోచ్‌గా పనిచేస్తున్న ఒకాయనను భయపెట్టి, డిజిటల్ అరెస్ట్ చేసి రూ.96వేలు లాగేశారు. రామచంద్రపురంలో ఒకాయనకు ఫోన్ చేశారు. రాజమండ్రికి చెందిన ఓ ఏసీటీవోను కొంతకాలం కిందట హనీ ట్రాప్ చేశారు. ఒక అమ్మాయి ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టగా ఆయన ఒకే చేశారు. తర్వాత న్యూడ్ వీడియో రాగా చూసి చాటింగ్ మొదలెట్టాడు. తర్వాత అతన్ని బెదిరించడంతో కొంత డబ్బు పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించాడు. కడియంలో ఒక విద్యార్థికి ఉద్యోగం ఆశ చూపి సుమారు రూ.10 లక్షలు లాగేశారు. రాజమహేంద్రవరానికి చెందిన ఓ స్టాక్ మార్కెట్ చేసే యువకుడు రూ.33 లక్షల వరకూ నష్టపోయాడు. జిల్లాలో ఈ తరహా నేరాలు పెరిగిపోయాయి.కానీ చాలా తక్కువ మంది మాత్రమే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో ఈఏడాది 140 సైబర్ నేరాలు..11 డిజిటల్ అరెస్టులు జరిగాయి. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులు ప్రమాదం నుంచి తప్పించుకోవాలంటే కేవలం అవగాహన ఒకటే మార్గం.ఈ ఏడాది 500 వరకూ ప్రమాదాలు జరగ్గా 700 మందికిపైగా క్షతగాత్రులయ్యారు.300 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో తలకు గాయం కావడం వల్ల 90 మంది వరకూ ప్రాణాలొదిలారు. ఈ ఏడాదిలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లం ఘనలపై 45 వేల కేసులు నమోదు చేయగా రూ.50లక్షల వరకూ జరిమానాలు విధించారు.ఈ ఏడాది అక్టోబరు 15న జరిగిన మహిళ అత్యాచారం జిల్లాను కుదిపేసింది. కడియం మండలం బుర్రిలంకలో నర్సరీలో పని ముగించుకొని ఇంటికి వెళ్తున్న రౌతు కస్తూరి అనే మహిళపై నలుగురు అత్యాచారం చేసి చంపేసి కాలువలో పడేశారు. ఉండ్రాజవరం మండలంలో అక్టోబరు 30న దీపావళి టపాసుల తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం సంభవించి ఇద్దరు ప్రాణాలు వదిలారు. ఇదే మండలంలో ఫ్లెక్సీ కడుతుండగా కరెంట్ షాక్‌కి గురై నలుగురు ప్రాణాలు కోల్పోయారు. దేవరపల్లి మండలంలో జీడిపిక్కల లోడుతో వెళ్తున్న వ్యాన్ తిరగబడడంతో నిడదవోలు మండలానికి చెందిన ఎనిమిది మంది చనిపోయారు. ఈ ఏడాది రహదారులు రక్తాన్ని తాగేశాయి.



గన్నవరం వద్ద జరిగిన ప్రమాదంలో మృతిచెందిన భార్య, కుమారుడిని పట్టుకుని రోదిస్తున్న భర్త


కోనసీమలోనూ రక్తపాతం..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదాలు.. హత్యలు.. దొంగతనాలు.. దోపిడీలతో పాటు సైబర్ నేరాలతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 2024 సంవత్సరం రికార్డులకెక్కింది. గంజాయి.. అక్రమ మద్యం రవాణా.దోపిడీలు, దొంగతనాలు అదే స్థాయిలో ఉన్నాయి. ఇక రోడ్డు ప్రమాదాల్లో యువకులే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు.అనేకమంది ఆత్మ హత్యలకు పాల్పడ్డారు.వివాహేతర సంబంధాలు, భూ వివాదాలతో కొందరు హత్యలకు గురైన ఘటనలు ఉన్నాయి.జిల్లాలో 2024 సంవత్సరంలో హత్యోదంతాలు సంచలనం రేకెత్తించాయి. గతేడాది జరిగిన అయినవిల్లి గ్రామానికి చెందిన జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసును ఇటీవల పోలీసులు ఛేదించి ఆ కేసులో వైసీపీ నేత తనయుడు పినిపే శ్రీకాంత్‌ను అరెస్టు చేయడం సంచలనమైంది. సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో పెంచుకున్న కొడుకు రాంబాబు ఆస్తి కోసం తండ్రి రావి వీరవెంకటనరసింహారావు (75)ను హత్య చేశాడు. ఈ ఏడాది ఆత్మహత్యల సంఖ్య గణనీయంగా పెరిగింది.జిల్లాలో రోడ్డు ప్రమాద ఘటనలు నిత్యం మృత్యు ఘంటికలు మోగిస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మే నెలాఖరునాటికి 65 మంది మృతిచెందగా 230 మందికి పైగా గాయపడ్డారు. ప్రధాన రహదారులపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 53 కేసుల్లో 65 మంది మృతిచెందారు. 145 కేసుల్లో 230 మందికి గాయాలయ్యాయి. జాతీయ రహదారులపైనే ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏడాదిలో భారీ దొంగతనాలు, దోపిడీలు జరిగాయి. పోలీసులు కూడా కేసుల పురోగతి సాధించి రికవరీ కూడా అదేస్థాయిలో చేశారు.



హత్య కేసులో అరెస్టయిన పినిపే శ్రీకాంత్(ఫైల్)



కాకినాడలో కత్తులు దూశారు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో నేరాలు, ఘోరాలు పెరిగాయి.హత్యలతో అట్టుడికింది. బ్యాంకు చోరీల దగ్గర నుంచి తుపాకీ చూపించి జ్యూయలరీ షాపుల్లో బంగారం ఎత్తుకుపోవడం, ప్రతీకారేచ్ఛతో నరుక్కోవడం వరకు అనేక పెను సంచలనాలకు జిల్లా కేంద్రంగా మారింది. అక్టోబరు 31న అర్ధరాత్రి కాజులూరు మండలం శలపాకలో ముగ్గురి దారుణహత్య జరిగింది. పాత కక్షల నేపథ్యంలో ఒకే కుటుంబంలో ముగ్గురు దారుణ హత్యకు గురయ్యారు.ఇదే తరహాలో డిసెంబరు 15న సామర్లకోట మండలం వేట్లపాలెంలో స్థలం ఆక్రమించి ఇంటిని నిర్మిస్తున్నారనే ఆగ్రహంతో దళితవాడలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని ప్రత్యర్థి కుటుంబం దారుణంగా నరికి చంపేసింది. జనవరి 23న కాకినాడలో ఏసీబీకి డ్రైనేజీ విభాగం ఈఈ పట్టుబడడంతో ఉద్యోగుల్లో దడ పెంచింది. ఫిబ్రవరి 8న ప్రత్తిపాడు స్టేట్ బ్యాంకులో జరిగిన భారీ చోరీ పోలీసులనే బెంబేలెత్తించి ంది. యూపీకి చెందిన ఓ ముఠా అర్ధరాత్రి వేళ ఏకంగా బ్యాంకుకే కన్నం వేశారు.ఈ ఘటనలో రూ.1.50 కోట్ల విలువైన బంగారం, రూ.30 లక్షల నగదు సైతం తస్కరించారు. ఫిబ్రవరి 26న ప్రత్తిపాడు వద్ద హైవేపై వెళ్తున్న లారీకి పంక్చర్ పడడంతో డ్రైవర్, ఇద్దరు క్లీనర్లు చూస్తుండగా రాజమహేంద్ర వరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొని వెళ్లిపోవడంతో ముగ్గురు దుర్మరణం పాల య్యారు. మార్చి 20న చేబ్రోలులో జంట హత్యలు తీవ్ర కలకలం రేపాయి.ఏప్రిల్ 1న కత్తిపూడిలో ఓ దుకాణంలో వెల్డింగ్ చేస్తుండగా ట్యాంకర్ పేలిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. జూలై 20న కాకినాడ కల్పన సెంటర్‌లో రాత్రి 9గంటలకు వేగంగా వచ్చిన ఓ కొత్తకారు ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారిని ఓ పాదచారిని ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు.ఆగస్టు 21న అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ఫార్మా కంపెనీ ప్రమాదంలో 18 మంది చనిపోయారు.వీరిలో ఇద్దరు కాకినాడ జిల్లాకు చెందిన వారు ఉండడం విషాదం నింపింది. డిసెంబరు చివరి వారంలో వరుసగా కాకినాడ, అన్నవరంలో రెండు వేర్వేరు జ్యూయలరీ దుకాణాల్లో దొంగతనాలు జరిగాయి.ఇలా ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే కాకినాడలోనూ కలకలం రేగింది.

4న జిల్లాస్థాయి విద్యా,వైజ్ఞానిక ప్రదర్శన

జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా

అమలాపురం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జనవరి 4న జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. ప్రస్తుతం మండలస్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీల నిర్వహణకుగాను 22 మండలాల నుంచి మండలానికి ఐదు ప్రాజెక్టులు చొప్పున 110 ప్రాజెక్టులను ఎంపిక చేస్తామన్నారు. జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల కమిటీకి అధ్యక్షుడిగా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, కమిటీ కన్వీనర్‌గా డీఈవో వ్యవహరిస్తారు. ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో జరిగే పోటీలకు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో భాగంగా క్విజ్ ఫెయిర్ ప్రదర్శన, బుక్ ఫెయిర్, సైన్స్ రంగవల్లుల ప్రదర్శన, తోలు బొమ్మల ప్రదర్శన పోటీలు ఉంటాయన్నారు. మరింత సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సెల్ 9640188525ను సంప్రదించవచ్చునని డీఈవో తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

అమలాపురం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం ఉదయం10 గంటల నుంచి కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయితో పాటు డివిజన్, మండలస్థాయిల్లో గ్రీవెన్స్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.



7లో

హోరాహోరీగా..

ఎస్.యానాంలో ముగిసిన వాలీబాల్ పోటీలు

ఉద్యోగులకు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు దొరబాబు

అమలాపురం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పాత పీఆర్సీ బకాయిలను, డీఏ బకాయిలను చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. అమలాపురం మద్దాలవారిపేటలో ఆదివారం ఎస్టీయూ పట్టణశాఖ సర్వసభ్య సమావేశం ఎన్.బాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దొరబాబు ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. పలు అంశాలపై చర్చించి తీర్మానించారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు నిల్వలో ఉన్న పీఎఫ్ సొమ్మును వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, జిల్లా నాయకులు ఎస్.సత్యనారాయణ, ఆర్ఆర్‌కే ప్రసాద్, రొక్కాల దుర్గ, బి.మంగారాణి, కె.సౌజన్య, సిద్ధార్థ, ఎస్.గోపీరాజు, బి.రమాకాంతరావు, పి.రవికుమార్, ఎమ్మెస్ఎన్ మూర్తి, ఎంఎంకేజీ మొయినుద్దీన్ తదితరులు మాట్లాడారు.

‘క్రియ’ అదిరింది!

- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు
- రెండోరోజూ ప్రతిభకు పట్టాభిషేకం
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు
- ముగిసిన రాష్ట్రస్థాయి క్రియ అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు


సంప్రదాయ వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారి

సర్పవరంజంక్షన్, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): కాకినాడలో నిర్వహిస్తున్న క్రియ పిల్లల పండుగ అంబరాన్నంటింది. రెండురోజులపాటు జరిగిన పోటీల్లో విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులతో సాంస్కృతిక నృత్యప్రదర్శనలు, మైమరిపించే కోలాట నృత్యాలు, అబ్బురపరిచే రీతిలో ఆకట్టుకునేలా చిన్నారులు గీసిన పెయింటింగ్స్‌తో ఆకట్టుకున్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో రెండురోజులుగానిర్వహిస్తున్న 11వ రాష్ట్రస్థాయి క్రియ అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు ఘనంగా ముగిశాయి. ముగింపు పోటీలో లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ పాల్గొన్నారు. సైన్స్ ఫేర్, చిత్రలేఖనం, సాంస్కృతిక నృత్యాలు, క్విజ్ పోటీలను స్వయం వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో పాల్గొనేందుకు ప్రోత్సహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. రెండోరోజు కార్యక్రమంలో భాగంగా జానపద నృత్యం (బృందం) విచిత్ర వేషధారణ(ఫ్యాన్సీ డ్రెస్), బుర్ర కథ, కోలాటం, ప్రాజెక్టు పని, వాద్య సంగీతం, మాటలు, కథ చెప్పడం, స్పెల్లింగ్, చిత్రలేఖనం, సృజనాత్మక వస్తువుల తయారీ, మైమ్, మట్టితో బొమ్మలు తదిర అంశాల్లో పోటీలు జరిగాయి. 5వ తరగతి వరకు సబ్ జూనియర్స్, 6, 7 తరగతులకు జూనియర్స్, 8,9,10 తరగతి విద్యార్థులు సీనియర్స్ విభాగంలో రెండురోజులపాటు పోటీలు జరిగాయి. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించిన విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ పోటీల్లో ఏపీ, తెలంగాణాకు చెందిన 350 పాఠశాలలకు చెందిన 11వేలమంది విద్యార్థులు, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమం లో సంస్థ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథ రాజు, డాక్టర్ కాద వెంకటరమణ, చుండ్రు జానకీరామ్ ప్రసాద్, మాచిరాజు, అల్లూరి సురేంద్ర, బత్తుల గణేష్, శివ, కృష్ణంరాజు పాల్గొన్నారు. పోటీలకు ప్రాంగణం ఇచ్చిన జేఎన్‌టీయూ వీసీ, దాతలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.




వివిధ రకాల సంప్రదాయ దుస్తులతో సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థినులు


పిట్టల దొరగా..


యముడిగా..


అమ్మవారిగా..


మైమ్ యాక్షన్‌లో...


సంప్రదాయ వేషధారణలో..


‘భువనం విజయం’ గురించి వివరిస్తూ..


కార్మికులు.. రైతు కూలీలుగా..


గిటార్ వాయిస్తూ..


‘ఆదర్శ గ్రామం’ ప్రాజెక్టుతో..


మట్టితో అందమైన ఆకృతులు

ఆటో...బైక్!



తాళ్లరేవు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు-సుంకటరేవు 216 జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఆటో ఎదుటి భాగంపై బైక్ ఎక్కింది. ఈ సంఘటనలో యువకుడికి గాయాలైనట్టు కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. తాళ్లరేవు పంచాయతీ జెల్లావారిపేటకు చెందిన దాసరి నూకరాజు బైక్‌పై తాళ్లరేవు నుంచి నీలపల్లి వెళ్తుండగా మార్గమధ్యంలో సుంకటరేవు వద్ద యానాం నుంచి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనగా బైక్ ఆటో ఎదుటిభాగంపైకి ఎక్కింది. నూకరాజుకు గాయాలవ్వగా పోలీసులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపికకు...

నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు

కాకినాడ క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుళ్ల నియామకానికి ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు సోమవారం నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ఎంపిక పారదర్శకంగా నిర్వహించేందుకు కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పటిష్ట చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 30 నుంచి జనవరి 18 వరకు నిర్వహించే ఈ దేహదారుఢ్య పరీక్షల్లో భాగంగా బయోమెట్రిక్, 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్‌జంప్ పరీక్షల నిర్వహణ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితర పరీక్షల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదివారం పరేడ్ గ్రౌండ్‌లో ట్రైల్ రన్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సివిల్ పోలీస్ కానిస్టేబుళ్ల 381 పోస్టులకు, అలాగే ఏపీఎస్పీ ఐఆర్ బెటాలియన్ కానిస్టేబుళ్ల 630 పోస్టులు పురుష అభ్యర్థులు 6,333, మహిళా అభ్యర్థులు 1,449 హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, ఎస్‌బి డిఎస్పీ శ్రీరామకోటేశ్వరరావ్ తదితరులు పాల్గొన్నారు.

తాబేళ్ల మరణంపై విచారణ చేపట్టాలి

డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలు

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ బీచ్ రోడ్, ఏపీఐఐసీ, వాకలపూడి ప్రాంతాల్లో అరుదైన ఆలివ్‌రిడ్లీ తాబేళ్లు అత్యధిక సంఖ్యలో మరణిస్తున్న విషయం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి వచ్చింది. తాబేళ్ల మరణానికి కారణాలు విచారించి, దీనికి కారణమవు తున్న వారిపై చర్యలు చేపట్టాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అండ్ హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ చిరంజీవిచౌదరిని ఆదేశించారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన

మానసిక రోగి మృతి

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ మానసిక రోగి దస్తులకు నిప్పు అట్టించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. బర్న్స్ వార్డులో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ రూరల్ మండలం కొవ్వాడకు చెందిన గొల్లపల్లి విశాలాక్షి (33) 10 ఏళ్ల క్రితం డిగ్రీ పాసై టెట్‌కు ప్రిపేరైంది. ఆ సమయంలో మెదడులో కణితి ఏర్పడి మానసిక ప్రవర్తనలో తేడా వచ్చింది. కుటుంబీకులు 15రోజుల క్రితం కాకినాడ జీజీహెచ్‌లోను సైకియాట్రీ వార్డులో చేర్పించగా ఫిమేల్ సెల్‌లో ఉంచి వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. అందరిని కొడుతుండడంతో మంగళవారం ఆమెను లోపల ఉంచి గెడపెట్టి బయట తల్లిదండ్రులు ఉన్నారు. విశాలాక్షికి ఇంజక్షన్ టైం అవ్వడంతో వారిద్దరూ నర్సు దగ్గరకు వెళ్లారు. ఆ సమయంలో విశాలాక్షి హాహాకారాలు చేస్తుండడం విని వెళ్లి చూడగా లోపల నుంచి మంటలు వస్తుండడంతో తలుపు తీసి చూడగా కూతురు కాలిపోతుండడాన్ని గమనించారు. విశాలాక్షి 70శాతం కాలిపోయిందని గుర్తించిన వైద్యులు బర్న్స్ వార్డుకు తరలించి ప్రత్యేక వైద్యం అందజేశారు. పరిస్థితి విషమించి శనివారం అర్ధరాత్రి మృతిచెందింది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎడ్ల పందేలు సంప్రదాయాల్లో భాగం

- శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు
- వడిశలేరులో రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు


పోటీలో పాల్గొన్న ఎడ్ల బండి


సీనియర్ విభాగంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే వాసు

రంగంపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎడ్ల పందేలు, కోడి పందేలు మన సంప్రదాయాల్లో, గ్రామీణ సంస్కృతిలో భాగమని, ఇవి లేకపోతే నాణ్యమైన పశుపక్ష్యాదుల సంపద అంతరించిపోతుందని, చట్టాన్ని అతిక్రమించకుండా ఇలాంటి పందేలను ఆదరించి పోషించుకోవాలని శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరు గ్రామం వద్ద గన్ని సత్యనారాయణమూర్తి స్మారక 6వ వార్షిక రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలను ఆదివారం నిర్వహించారు. పందేలను రఘురామ తిలకించి సీనియర్ విభాగంలో విజేతలైన రైతులకు బహుమతి ప్రదానం చేశారు. తండ్రి పేరిట ఈ పోటీలను ఏటా నిర్వహిస్తున్న జీఎస్ఎల్ సంస్థల చైర్మన్ గన్ని భాస్కరరావును ప్రశంసించారు. కాగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ పోటీలను ప్రారంభించారు. పోటీలను క్రమం తప్పకుండా నిర్వహించడం విశేషమన్నారు. మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ కోడి పందేలు, ఎడ్ల పందేలు లేని తెలుగు సంప్రదాయాన్ని ఊహించలేమన్నారు. జూనియర్ విభాగంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గన్నిభాస్కరరావు తెలుగు సంప్రదాయాన్ని పటిష్టం చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు రౌతు సూర్యప్రకాశ్ రావు,జక్కంపూడి రాజా తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

రంగంపేట/ఆలమూరు: వడిశలేరులో జరిగిన ఎడ్లబండ్ల పరుగు పోటీల్లో సీనియర్ విభాగం (1600 మీటర్ల దూరం)లో కోనసీమ జిల్లా గుమ్మిలేరు గ్రామానికి చెందిన కోర స్మృతిచౌదరి ఎడ్లజత మొదటి బహుమతి, అనకాపల్లి జిల్లా కేజీపురం రైతు శ్రీఆంజనేయం ఎడ్లజత రెండో బహుమతి, కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన కోర స్మృతిచౌదరి ఎడ్ల జత మూడో బహుమతి గెలిచుకున్నాయి. జూనియర్ విభాగం(1000 మీటర్ల దూరం)లో కోనసీమ జిల్లా మండపేటకు చెందిన వేగుళ్ల కృష్ణమాధవి ఎడ్ల జత మొదటి బహుమతి, కోనసీమ జిల్లా గుమ్మిలేరు రైతు కోర స్మృతి చౌదరి ఎడ్ల జత రెండో బహుమతి, నెల్లూరు జిల్లా గంగపట్నం గ్రామానికి చెందిన చాముండేశ్వరీ సీఫుడ్స్ ఎడ్ల జత మూడో బహుమతి గెలుచుకున్నాయి. పోటీల న్యాయనిర్ణేతలైన సూరపనేని రామకృష్ణప్రసాద్ (కృష్ణా జిల్లా), చేకూరి రామకృష్ణ (కాకినాడ)లను సత్కరించారు.

వెల్లివిరిసిన సృజనాత్మకత

కొండగుంటూరులో ఆకట్టుకున్న టీఎల్ఎం మేళా

దివాన్‌చెరువు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అక్షరాల తోట– పదాలపంట, చిట్టిబుర్రలో ఇమిడిన అక్షరమాల (అక్షర శిరోజాలు)- కూడికల యంత్రం... టార్చిలైట్‌తో పదాల గుర్తింపు ఇలా ఒకటేమిటి వందల సంఖ్యలో ఉపాధ్యాయులు తమ సృజనాత్మకతకు పదునుపెట్టారు. వెల్లివిరిసిన సృజనాత్మకతకు లోకాస్ట్‌-నోకాస్ట్ సామగ్రితో రూపొందించిన బోధనోపకరణాలు ప్రతిఒక్కరినీ ఆకట్టుకున్నాయి. వైవిధ్యంగా రూపొందించిన అక్షరాల వాలుజాడ, చేప బొమ్మలతో తీసివేతలు, బొమ్మచూడు- అక్షరం పట్టు తదితర బోధనోపకరణాలకు తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని కొండగుంటూరులో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ ఆరో దశ శిక్షణా శిబిరం ఆదివారం వేదికైంది. అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన 350 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారు. శిక్షణలో భాగంగా ఉపాధ్యాయులు రూపొందించిన బోధనోపకరణాలను ప్రత్యేక గదిలో ఉంచి మేళా నిర్వహించారు. నాలుగు జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు దాదాపు 190 వరకూ వివిధ రకాల వర్కింగ్ మోడల్స్‌ను రూపొందించారు. టీఎల్ఎం మేళా విజ్ఞాన మార్పిడి కేంద్రంగా మారిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. గణితం సబ్జెక్టుకు సంబంధించి చతుర్విధ ప్రక్రియలపై అవగాహన కల్పించేందుకు రంగంపేట మండలం సింగంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, శిక్షణా శిబిరం కేఆర్‌పీ సీహెచ్ గౌతమ్‌కృష్ణ రూపొందించిన గణిత రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కూడికలు, తీసివేతలు, భాగాహారం, గుణకారం ప్రక్రియను విద్యార్థులకు సులభంగా ఉపాధ్యాయులు నేర్పడానికి, విద్యార్థులు నేర్చుకోవడానికి కూడా ఉపకరిస్తుందని శిక్షణా కేంద్రం కోర్స్ కోఆర్డినేటర్ ఎం.రాంబాబు తెలిపారు. ఈ శిక్షణా తరగతులు మంగళవారం ముగుస్తాయని తెలిపారు. ఈ రోబోను అట్టముక్కలతోవారం రోజుల్లో తయారు చేసినట్టు గౌతమ్‌కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్‌వీ సోమిరెడ్డి, ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ అనూష, కేఆర్‌పీ కె.ఈశ్వరరావు, డీఆర్పీలు ఉన్నారు.


గణితరోబో,అక్షరశిరోజాల దృశ్యాలు

కబడ్డీ పోటీలకు ఎంపిక

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జనవరి 3, 4, 5 తేదీల్లో జరగబోయే 50వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొనే బాలురు, బాలికల జట్ల ఎంపికలు ఆదివారం నిర్వహించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడామైదానంలోని కబడ్డీ గ్రౌండులో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. మండల సూర్యనారాయణ, యశ్వంత్, జిల్లా పీడీలు, పీఈటీల అసోసియేషన్ సెక్రటరీ ఎస్.నాగరాజు తదితరులు ఉన్నారు.

ఎస్.యానాంలో హోరాహోరీగా...

ముగిసిన మహిళల బీచ్ వాలీబాల్ పోటీలు


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఉప్పలగుప్తం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో నేషనల్ మహిళల బీచ్ వాలీబాల్ పోటీల ఫైనల్స్ ఆదివారం హోరాహోరీగా జరిగాయి. తమిళనాడు, వేల్స్ యూనివర్సిటీ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఈ మ్యాచ్‌లో వేల్స్ జట్టుపై తమిళనాడు జట్టు 27-25, 22-20, 15-17 సెట్ల తేడాతో విజయం సాధించింది. పాయింట్ల పట్టికలో టాప్4లో తమిళనాడు, వేల్స్ యూనివర్సిటీ, ఆంధ్రా, పుదుచ్చేరి జట్లు నిలిచాయి.. ఆంధ్రా, పుదుచ్చేరి జట్లు తలపడగా పుదుచ్చేరి జట్టు విజయం సాధించి మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీలకు మహిళలకు అధిక సంఖ్యలో హాజరుకావడం విశేషం. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో జరిగిన ఈపోటీలను కొత్తపేట, పి.గన్నవరం, ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, గిడ్డి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, అమలాపురం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, కూటమి నాయకులు అరిగెల నానాజీ, దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ తిలకించారు. వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పలచోళ్ల పద్మనాభం ఆధ్వర్యంలో టోర్నీ కార్య నిర్వాహక కార్యదర్శి గోలకోటి ఫణీంద్రకుమార్ పర్యవేక్షణలో జరిగిన పోటీల్లో 33మంది పీడీలు టోర్నీ విజయవంతానికి కృషి చేశారు. టోర్నీ విజయవంతానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆనందరావు ను సహచర ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు, క్రీడాకారులు సన్మానించారు. ఎస్.యానాం సర్పంచ్ జోగి రాజేశ్వరిరాజా, వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లంకే రాజు, సంయుక్త కార్యదర్శి అయితా బత్తుల అజయ్‌సింగ్, వాటర్ డీసీ చైర్మన్ దంగేటి చిట్టిబాబు, సత్తి చిన్నా తదితరులున్నారు.


విజేత జట్టుకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యేలు అయితాబత్తుల, గిడ్డి

అన్నవరం దేవస్థానంలో

నగదు రహిత సేవలకు మోక్షం

రెండు కౌంటర్ల ఏర్పాటు

అన్నవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో నగదు రహిత సేవలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రస్తుత కాలంలో ప్రతిఒక్కరూ ఫోన్, పే, గుగూల్ పే తదితర వాటి ద్వారా లావాదేవీలు జరుపుతున్నా అన్నవరం దేవస్థానంలో ఇప్పటివరకు అటువంటి సౌకర్యం కల్పించకపోవడంతో భక్తులు అనేక ఇబ్బందులకు గురయ్యేవారు. దీనిపై ఆంధ్రజ్యోతి, ఇతర మీడియాలలో కథనాలు వెలువడ్డాయి. ఈవో సుబ్బారావు బాధ్యతలు స్వీకరించాక భక్తుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని రిసెప్షన్ కార్యాలయం, పశ్చిమరాజగోపురం వద్ద కౌంటర్లను ఏర్పాటు చేశామని.. భక్తులు వ్రతాలు, దర్శనం టిక్కెట్లు, విరాళాలు, వసతి సౌకర్యం కోసం ఇకపై డిజిటల్ పేమెంట్ల ద్వారా చెల్లింపులు చేపట్టవచ్చని దేవస్థానం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు హుండీల లెక్కింపు

సత్యదేవుడి సన్నిధిలో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించనున్నట్టు అధికారులు తెలిపారు. సిబ్బంది విధిగా హాజరుకావాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఇద్దరి దాతల నుంచి రూ.2 లక్షలు విరాళంగా సమకూరాయి. కాకినాడకు చెందిన ముప్పిడి సత్యవాణి రూ.లక్ష ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌కు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌కు చెందిన కాలా కార్తికేయదత్త రూ.1,01,116లు దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందించగా దాతలను అభినందించారు.


విరాళం అందజేస్తున్న దాత సత్యవాణి

పాపికొండలకు 12 బోట్లలో పర్యాటకులు


పాపికొండలకు వెళ్తున్న పర్యాటక బోట్లు

దేవీపట్నం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ ఒడ్డున ఆనుకుని ఉన్న పాపికొండల అందాలను తిలకించేందుకు పర్యాటకులు తెలుగు రాష్ట్రా నలుమూలల నుంచి ఆదివారం తరలివచ్చారు. పోశమ్మగండి వద్ద ఉన్న బోటు పాయింట్ నుంచి ఉదయం 12 బోట్లలో సుమారు 800 మంది పాపికొండలు తరలివెళ్లారు. గోదావరి పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవిపట్నం, మంటూరు, కొండమొదలు తదితర ముంపు గ్రామాల మీదుగా పేరంటాలపల్లి వెళ్లారు. అక్కడ శివున్ని దర్శించుకుని గిరిజనులు తయారుచేసే వెదురు వస్తువులను కొనుగోలుచేశారు. ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రజా పోరాటాలకు కమ్యూనిస్టు ప్రణాళిక దిక్సూచి


మాట్లాడుతున్న మాజీ ఎంపీ బాబూరావు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు ప్రణాళిక నిత్య నూతనం అని సీపీఎం నాయకుడు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. సీపీఎం పార్టీ తూర్పుగోదావరి జిల్లా మహాసభల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన ప్రతినిధులు సభలో అరుణపతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా పోరాటాలకు కమ్యూనిస్టు ప్రణాళిక దిక్సూచి వంటిదన్నారు. దేశం, రాష్ట్రంలో కుల, వర్గ, మతం వంటి సామాజిక విభజన ఉన్నప్పటికీ కమ్యూనిస్టులను అందరూ స్వాగతిస్తారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు మంతెన సీతారాం మాట్లాడుతూ కవులు, కళాకారులకు పుట్టినిల్లయిన రాజమహేంద్రి అభ్యుదయ, సాంఘిక ఉద్యమాలకు వేదిక అన్నారు. సభలో నివేదికను జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్, జువ్వల రాంబాబు, పి.తులసి, సుందరబాబు, బేబీరాణి, ఎన్.రాజా, ఎస్ఎస్.మూర్తి, పోలిన వెంకటేశ్వరరావు, టీఎస్.ప్రకాష్, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

వేట్లపాలెంలో అధికారుల పర్యటన

సామర్లకోట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం దళితవాడలలో ఆదివారం కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు తదితర రెవెన్యూ, పోలీసు సిబ్బంది సంయుక్తంగా పర్యటించారు. ఈనెల 15న ఒకే సామాజిక వర్గానికి చెందిన 2 కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదం కారణంగా కత్తులతో ఒక కుటుంబం దాడులు చేసి ముగ్గురిని హతమార్చిన విషయం విదితమే. దీంతో గ్రామంలో ఆదివారం పోలీసు అధికారులతో కలిసి ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించి బాధిత కుటుంబాలకు మానసిక ధైర్యం అందించారు. ఆర్డీవో మల్లిబాబు, డీఎస్పీ శ్రీహరిరాజు ఇరు కుటుంబాలకు చెందిన వ్యక్తులతో చర్చించి గ్రామంలో శాంతికి సహకరించాలని కోరారు. ఇంకా ఈ సంఘటనలో పాల్గొన్న పలువురిని ఇంకా అరెస్ట్ చేయాల్సి ఉందని చెప్పగా త్వరలో నే అరెస్ట్ చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రావులపాలెం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడులో తాళం వేసిన ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి తాళాలు పగలుకొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుడు శనగన ధర్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... ఏడాది కాలం నుంచి స్థానిక శివాలయం వీధిలో అద్దె ఇంట్లో ధర్మయ్య నివసిస్తున్నాడు. ఈనెల 25వ తేదీన గోకవరంలో బంధువుల ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమానికి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. తిరిగి ఆదివారం ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగలు కొట్టి ఉన్నాయి. లోపలకి వెళ్లి పరిశీలించగా బీరువా పగులకొట్టి అందులోని 20 తులాల వెండి వస్తువులు, 4 కాసుల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ చంటి సిబ్బందితో వెళ్లి వివరాలు నమోదు చేసుకుని కేసు నమోదు చేశారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించారు.

కువైట్ దాతల సాయం

అంతర్వేది, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ పనిలో నడుముకు గాయమై మంచానికే పరిమితమైన అంతర్వేది ప్రకాశపురానికి చెందిన చొప్పల సురేంద్రకు కువైట్ దాతలు అందించిన నిత్యావసరాలను పీఎంపీ రాపాక చిన్ని, తాడి మోహన్‌బాబు అందించారు. శ్రీనవోదయ ఎలక్ట్రికల్, ప్లంబింగ్ యూనియన్ నిత్యావసరాలు, నగదు అందజేశారు.

సంజీవ్‌కు ఐకాన్ ఆఫ్ హెల్త్‌కేర్ అవార్డు

మామిడికుదురు,డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): వైద్యంలో చేస్తున్న సేవలకు ఈదరాడకు చెందిన హోమియో వైద్యుడు చిక్కం సత్యసంజీవ్‌టైమ్స్ ఐకాన్ ఆఫ్ హెల్త్‌కేర్ 2024అవార్డును అందుకున్నారు విజయవాడలో తాజ్ వివంతాలో జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎన్.వెంకటరమణ శనివారం రాత్రి అవార్డును అందించారు.

గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రమోషన్లు కల్పించాలని వినతి



వీఆర్వోల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజుకు వినతిపత్రం అందజేసిన జిల్లాశాఖ ప్రతినిధులు

అమలాపురం టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామరెవెన్యూ అధికారుల్లో అర్హతలు కలిగి పదోన్నతులు కోసం పదేళ్లుగా ఎదురుచూస్తున్న వారికి వెంటనే ప్రమోషన్లు కల్పించాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటగణేష్ ఆధ్వర్యంలో జిల్లా ప్రతినిధులు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు భూపతిరాజు రవీంద్రరాజు, అప్పలనాయుడులకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సంఘం తరపున ప్రభుత్వంతో చర్చలు జరిపి గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వీఆర్వో గ్రేడ్-1,2లకు కామన్ డీడీవోగా తహశీల్దార్ ఉండాలని, బయోమెట్రిక్ అటెండెన్స్ ఏపీఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా హాజరువేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. వీఆర్వోలకు పదోన్నతులు, ప్రత్యేక కార్యాలయాల ఏర్పాటు, కంప్యూటర్ సదుపాయం కల్పించాలన్నారు. పని ఒత్తిడి పెరిగిపోతున్నందున వీఆర్ఏ పోస్టులను భర్తీ చేయాలని, మహిళా వీఆర్వోలకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకే పనివేళలు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ కార్యదర్శి కోరుకొండ శ్రీనివాసరావు, మాచిరాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కులాల ఐక్యతను దెబ్బతీసే విధంగా సుప్రీం తీర్పు

విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి మూర్తి



మాట్లాడుతున్న విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి మూర్తి

అమలాపురం రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కులాల ఐక్యతను దెబ్బతీసే విధంగా సుప్రీంకోర్టు తీర్పు ఉందని విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఈదరపల్లి అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి మూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిభ ఆధారంగానే రిజర్వేషన్ అమలు జరుగుతుందన్న విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. కులాల ఆధారంగా రిజర్వేషన్లు అమలు కావడం లేదని వివరించారు. అంటరానితనాన్ని చట్టపరంగా నిషేధించడమే కాదు ఆ భావనను ప్రజల మనసుల నుంచి తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత రిజర్వేషన్ల విధానానికే విఘాతం కలిగించేలా సుప్రీంకోర్టు తీర్పు ఉందని, ఆ తీర్పును ఆధారంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ విధానాన్ని ముందుకు తీసుకువెళ్లే ఆలోచన మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల నకులరాజు, గోసంగి బంగార్రాజు, పెనుమాల చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు ఐఎన్ మల్లేశ్వరరావు, నేరేడుమిల్లి సత్యనారాయణ, ఎంఏకే భీమారావు, జల్లి శ్రీనివాస్, వివిధ జిల్లాల ప్రతినిధులు, గెడ్డం ప్రదీప్ పాల్గొన్నారు.

ఆ ర్యాంపులో తవ్వకాలు ఎలా జరుపుతారు!

● ట్రాక్టర్లను అడ్డుకుని ధర్నాకు దిగిన టీడీపీ, జనసేన నాయకులు



ధర్నా నిర్వహిస్తున్న జనసేన, టీడీపీ నాయకులు

పి.గన్నవరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా నదీతీర ప్రాంతంలో ఇసుక తవ్వకాలు ఎలా జరుపుతారని లంకలగన్నవరానికి చెందిన జనసేన, టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. లంకలగన్నవరంలో ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుని పార్టీ జెండాలతో ధర్నాకు దిగారు. లంకలగన్నవరం గ్రామం వశిష్ట, వైనతేయ నదీపాయల మధ్య ఉండటంతో కోతకు గురవుతుందన్నారు. ఇదే విషయమై అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోతకు గురవుతున్న ప్రాంతంలో ఇసుక ర్యాంపులు నిర్వహించి ఇసుక అక్రమ రవాణా ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఇదిఇలా ఉండగా తొలుత గ్రామంలోని మూడు చోట్ల పది ఇసుక ట్రాక్టర్లను నాయకులు అడ్డుకున్నారు. ఈక్రమంలో స్థానిక నాయకులు, యువ నాయకులు మధ్య జరిగిన చర్చల్లో ఎమ్మెల్యే అండతోనే ర్యాంపు నడుస్తోందని స్థానిక ప్రజాప్రతినిధి ఒకరు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని ర్యాంపులు మూయించివేసి ఈర్యాంపును మాత్రం ఎలా నడిపిస్తారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా గ్రామస్తులు అనుమతి లేకుండా ర్యాంపునకు నేను ఎలా మద్దతిస్తానని ఓ మండల నాయకుడు వద్ద ఎమ్మెల్యే వాపోయినట్లు తెలిసింది. ఈధర్నాలో గ్రామ సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, గనిశెట్టి శ్రీనివాసరావు, యర్రంశెట్టి వెంకటరమణ, లంకే చిరంజీవి, గనిశెట్టి ఈశ్వర్, కొపనాతి సీతారామస్వామి, గూటం కృష్ణంరాజు, నాగాబత్తుల బుజ్జి, యన్నాబత్తుల నాగరాజు, యన్నాబత్తుల సతీష్, యర్రంశెట్టి నాగేశ్వరావు, నల్లా పెద్దకాపు, చిట్టాల జోగేశ్వరావు, అడబాల సుబ్బరాయుడు, లంకే కృష్ణరావు పాల్గొన్నారు.

సూరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ముమ్మిడివరం, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): శ్రీఉమా సూరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రదక్షిణ, గణపతిపూజ, పంచహవచనం, పంచగవ్యప్రాసన, మహన్యాసం, రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, అమ్మవారికి కుంకుమపూజ, రుద్రహోమం, సూర్యనమస్కారాలు, నవగ్రహ అర్చనలు, హోమాలు, ధూపసేవ, శాంతికల్యాణం, పండిత సత్కారం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. అర్చకుడు కొత్తలంక సూరిబాబు ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వి.చిన్నారావు, శ్రీనివాస్, రాంబాబు, కె.రామలింగేశ్వరరావు, ఏవీఆర్ రమేష్, జేజిబాబు, సురేష్, శివ, కిరణ్ దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పూజల్లోపాల్గొన్నారు.

భారతరత్న అవార్డుకు మన్మోహన్‌సింగ్ అర్హుడు

యానాం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): భారతరత్న అవార్డుకు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అర్హుడని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. మన్మోహన్‌సింగ్ మృతి పట్ల మల్లాడి సంతాపం తెలిపారు. తన స్వగృహంలో ఆదివారం నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మల్లాడితో పాటు నాయకులు, కార్యకర్తలు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మల్లాడి మాట్లాడారు. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో 12సార్లు కలిసినట్లు చెప్పారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.

పసల్‌బీమా యోజనపై అవగాహన

అంతర్వేది, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి తహశీల్దార్ కార్యాలయం, వ్యవసాయ, ఉద్యానశాఖ, సొసైటీ సిబ్బందికి ప్రధాన మంత్రి పసల్ బీమా యోజనపై ఆదివారం అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్టు వ్యవసాయాధికారి పీవీ నరసింహరావు తెలిపారు. రబీ వరి పంట బీమా రైతు వాటా 25శాతం ప్రీమియంను ఈనెల31వతేదీలోపు చెల్లించాలని, ఒక ఎకరాకు రూ.630 చెల్లించాలన్నారు. ప్రస్తుత రబీ పంట సాగు చేస్తున్న రైతులు తమ పరిధిలోని రైతుసేవా కేంద్రం వద్ద ఈ-పంట ధ్రువీకరణ పత్రం తీసుకోవాలన్నారు. ప్రధానంగా రైతులందరూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు.

'యానాంలో 4న మన ఊరు శుభ్రత'



సమావేశంలో మాట్లాడుతున్న మల్లాడి

యానాం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): యానాంలో జనవరి 4న మన ఊరు శుభ్రత కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. గ్రామాల పర్యటనలో ప్రజలు పారిశుధ్య సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. జనవరి 6నుంచి 8వరకు యానాం ప్రజా ఉత్సవాలు ఘనంగా జరుగుతాయన్నారు. ఈఉత్సవాలకు పుదుచ్చేరి గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, అధికారులు హాజరవుతారన్నారు. ఈనేపథ్యంలో యానాన్నిపరిశుభ్రంగా ఉంచాలనే సంకల్పంతో ఊరు శుభ్రత కార్యక్రమం నిర్వహిస్తున్నామ న్నారు. 4వ తేదీ ఉదయం 6గంటలకు స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానం నుంచిరాజకీయాలకు అతీతంగా ఈకార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 50ట్రాక్టర్లతో ట్రాక్టర్‌కు పది మంది చొప్పున మొత్తం 500మంది సిబ్బందితో ఒకేసారి పారిశుధ్య చర్యలు చేపట్టి యానాన్ని అందంగా తీర్చిదిద్దుతామన్నారు. స్థానిక గ్రామాల ప్రతినిధులు, పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరూ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనాలన్నారు.

జనసైనికుల కుటుంబాలకు సహాయం

మలికిపురం,డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): కత్తిమండకు చెందిన చిట్టాల పద్మనాభం, కడలికి చెందిన చిక్కాల రంగారావు ప్రమాదవశాత్తూ మరణించారు. జనసేన సభ్యత్వ నమోదు ద్వారా వర్తించే ఇన్సూరెన్సు రూ.5లక్షలు చొప్పున వారి కుటుంబాలకు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రాజానగరంలో జరిగిన కార్యక్రమంలో అందజేసినట్టు మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు ఆదివారం తెలిపారు. రాజోలునియోజకవర్గం నుంచి రాష్ట్ర కార్యదర్శి గెడ్డం మహాలక్ష్మీప్రసాద్, ఎంపీటీసీ జక్కంపూడి శ్రీదేవి, రాజోలు వైస్‌ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు పాల్గొన్నారు.

హైందవ శంఖారావ సభను విజయవంతం చేయాలి

మామిడికుదురు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావ సభను విజయవంతం చేయాలని విశ్వహిందూపరిషత్, ఆర్ఎస్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం వారు మగటపల్లిలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబును కలుసుకుని శంఖారావ సభకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వానపత్రికను అందించారు.

వీరేశ్వరస్వామి వారి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దాట్ల, మాజీ ఎమ్మెల్యే చెల్లి తదితరులు

ఐ.పోలవరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) మురమళ్ల శ్రీభద్రకాళీసమేత వీరేశ్వరస్వామి వారి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) ఆదివారం మురమళ్ల క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. స్వామివారికి సంబంధించిన నిత్య పూజలు, కల్యాణ వివరాలు తదితర విషయాలు క్యాలెండర్‌లో భక్తుల సౌకర్యార్థం పొందుప ర్చినట్టు కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 26న జరిగే శివరాత్రి ఉత్సవాన్ని పురస్కరించుకుని సప్త గోదా వరి జలాలకు సంబంధించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు చెల్లి వివేకానంద, దాట్ల ఇంద్రరాజు, దాట్ల రామకృష్ణంరాజు, అర్చకస్వాములు పేటేటి శ్యామలకుమార్, యానమండ్ర సుబ్బారావు, నాగాబట్ల రామకృష్ణమూర్తి, గంటి సుబ్రహ్మణ్యశాస్త్రి, నాగాబట్ల రవిశర్మ పాల్గొన్నారు.

బీచ్‌వాలీబాల్ టోర్నీకి ఎస్.యానాం చక్కని ప్రదేశం

రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ బృందం



గొల్లవిల్లిలో క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ బృందం

ఉప్పలగుప్తం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నేషనల్ బీచ్ వాలీబాల్ పోటీల నిర్వహణకు ఎస్.యానాం చక్కని ప్రదేశమని రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అభిప్రాయం వ్యక్తం చేసింది. విశాలమైన వైట్ శాండ్ బీచ్‌లో నేషనల్ పోటీల నిర్వహణ తీరుతెన్నులపై అసోసియేషన్ సంతృప్తి వ్యక్తం చేసింది. ఆదివారం రాష్ట్ర బృందం గొల్లవిల్లిలో జాతీయ వాలీబాల్ పోటీలు నిర్వహించిన క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించింది. గతంలో ఇక్కడ టోర్నీ నిర్వాహకులు వుండ్రు రాజబాబు, అరిగెల నానాజీతో బృందం చర్చించింది. గతంలో గొల్లవిల్లి టోర్నమెంటులో పాల్గొన్న జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుల వివరాలపై చర్చ జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ ట్రెజరర్ నాదెండ్ల బ్రహ్మాజీరావు, కృష్ణా జిల్లా కార్యదర్శి డి.దయాకరరావు, క్రీడాకారుడు కె.వెంకటేశ్వరరావు, నేషనల్ రిఫరీ బి.అమరేంద్ర, ఎస్సీ రైల్వే మహిళాటీమ్‌కోచ్ ఎ.రామనాథంచౌదరి(రాము), అరిగెల నరేష్, వుండ్రు రాజీవ్ పాల్గొన్నారు.

ఆప్తా ఆధ్వర్యంలో రూ.2.50 కోట్ల ఉపకార వేతనాలు



అమలాపురంలో ఆప్తా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న నాయకులు

అమలాపురం టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అమలాపురం కాపు కల్యాణ మండపంలో ఆదివారం అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఆప్తా అమెరికా అధ్యక్షుడు ముద్రగడ త్రినాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 400మంది విద్యార్థులకు రూ.2.50కోట్ల మేర ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. విశ్రాంత కలెక్టర్ పి.లక్ష్మీకాంతం, అమెరికా నుంచి ఆప్తా ప్రతినిధులు గూడపాటి గోపాల్, బోగాటి రెడ్డీస్, సప్తగిరీస్, మంచిగంటి శ్రీలక్ష్మీదీప్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులకు ఉపకార వేతనాలతో పాటు మహిళా సాధికారిత, వైద్య శిబిరాల ఏర్పాట్లు వంటి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆప్తా ప్రతినిధులను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు అభినందించారు. నల్లా పవన్‌కుమార్, కాపు రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా విష్ణుమూర్తి, బెంగళూరు, చెన్నై డైరెక్టర్లు పురుషోత్తమ నాయుడు, అరిగెల తమ్మయ్యనాయుడు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో నక్కా సూర్యచంద్రరావు, పేరాబత్తుల రాజశేఖర్, కల్వకొలను తాతాజీ, అధికారి జయవెంకటలక్ష్మి, యేడిద శ్రీను, ఆశెట్టి ఆదిబాబు, బొర్రా వెంకటేశ్వరరావు, నల్లా స్వామి, దున్నాల దుర్గ పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్లు పార్లమెంటులో ఆమోదించాలి

అంబాజీపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో ఆమోదించాలని బీసీ కులగణన రాష్ట్ర కమిటీ చైర్మన్ అంగదాల పూర్ణచంద్రరావు అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలోని సామాజిక భవనంలో బీసీ సమన్వయ జిల్లా కమిటీ సమావేశం బీసీ నాయకుడు దొంగ రామసత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బీసీ కులగణనకు రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా ముఖ్యప్రాంతాల్లో బీసీ నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళా బిల్లులో బీసీలకు ఉపకోటా కల్పించాలన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కోకన్వీనర్ కె.శ్రీనివాసులు, పి.వెంకటరమణ, కె.నరసింహం, కుసుమ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

అమలాపురం టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అమలాపురం టౌన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఆదివారం దివంగత డాక్టర్ మెట్ల వెంకటసత్యనారాయణరావు మెమోరియల్ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. క్రీడాకారులతో పాటు వారి తల్లిదండ్రుల కోసం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ ప్రారంభించి టౌన్ బ్యాంకు సేవలను కొనియాడారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ మెట్ల వెంకటసూర్యనారాయణ, డాక్టర్ రాఘవేంద్రరావు, డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ గొలకోటి రంగారావు, డాక్టర్ ఆకెళ్ల వెంకట్రావు, డాక్టర్ చంద్రమౌళి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షుడు ఎండీ అమీర్, జాన్‌పాల్, ఎండీ వేణుగోపాల్, క్లబ్ కార్యదర్శి రంకిరెడ్డి కాశీ తదితరులు సేవలందించారు.

చినరాజప్ప పరామర్శ

అల్లవరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కోడూరుపాడులో నడంపల్లి సత్యవతీదేవి మృతితో సతీవియోగంతో బాధపడుతున్న టీడీపీ నేత, ఎస్‌కేబీఎస్ కళాశాల కమిటీ చైర్మన్, సర్పంచ్ నడంపల్లి సుబ్రహ్మణ్యంరాజును పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించారు. సత్యవతీదేవి చిత్రపటం వద్ద పుష్పాలువేసి నివాళులర్పించారు. మల్లుల పోలయ్య, యాళ్ల నాగసతీష్, అల్లు సత్తిబాబు, మంద గెద్దయ్య పరామర్శించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



అల్లవరం, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): దేశవిదేశాల్లో వివిధ వృత్తుల్లో ఉన్న పూర్వ విద్యార్థులంతా 30ఏళ్లతరువాత తాము చదువుకున్న స్కూల్‌లో సమావేశమయ్యారు. కొమరగిరిపట్నం శ్రీన్యాపతి సుబ్బారావుపంతులు జడ్పీ హైస్కూల్‌లో 1993-94బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం తాము చదివిన హైస్కూల్‌లో సమావేశమయ్యారు. ఒకరినొకరు పలకరించుకుని గతస్మృతులతో ఆనందంగా గడిపారు. ముందుగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను బెండమూర్లంక సెంటర్ నుంచి బ్యాండ్ మేళతాళాలతో హైస్కూల్‌కు తీసుకుని వెళ్లారు. ఉపాధ్యాయులు ఎల్.అప్పారావు, చిట్టిబాబు, సుబ్రహ్మణ్యం, హరిబాబులను ఘనంగా సన్మానించి వెండి వస్తువులను బహూకరించారు. పూర్వవిద్యార్థులు సంగీతంనాగరాజు(అమెరికా), ప్రముఖ పారిశ్రామిక వేత్త పిండి సుబ్బారావు(హైదారబాద్), వీరా హరిబాబు, కూనపరెడ్డి కిషోర్, మురమళ్ల వీరభగవాన్, బండారు వరలక్ష్మీతో పాటు పూర్వపు విద్యార్థులంతా అపూర్వకలయికతో ఆనందంగా గడిపారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

ముమ్మిడివరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా యర్రంశెట్టి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ముమ్మిడివరం వర్తక సంఘ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న వర్తకులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావనకు తీసుకువచ్చారు. వర్తకులకు ఎదురయ్యే సమస్యలు అంతా కలిసికట్టుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం నూతన చాంబర్ కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా యర్రంశెట్టి వెంకటేశ్వరరావు ఎన్నిక కాగా గౌరవాధ్యక్షుడిగా పసుమర్తి వెంకటసుబ్బారావు, కార్యదర్శిగా కంచర్ల నగేష్, ట్రెజరర్‌గా అప్పన తాతాజీ, ఉపాధ్యక్షుడిగా నలమాటి కొండలరావు, సంయుక్త కార్యదర్శి వెత్సా నాగు, కార్యవర్గ సభ్యులుగా చోడపనీడి బాలకృష్ణ, కొప్పిశెట్టి చంద్రశేఖర్, విళ్ల చలపతి, సుంకర గంగ, పి.నాగరాజు, యర్రంశెట్టి శ్రీను, రాయపురెడ్డి వెంకటస్వామి, వెత్సా సుబ్బారావు, కోన శ్రీహరిరెడ్డి, చెల్లూరి షణ్ముకాచారి, పసుమర్తి కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను పూలమాలలు, దుశ్శాలువాలతో పలువురు సత్కరించారు.

క్రియ కథల పోటీల్లో కౌస్తుభకు తృతీయ స్థానం

అమలాపురం రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయూలో జరిగిన రాష్ట్ర స్థాయి పిల్లల పండుగ క్రియ పోటీల్లో అమలాపురం మండలం ఇందుపల్లి బొంతువారిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 5వ తరగతి విద్యార్థిని శ్రీపాద మీనాక్షి కౌస్తుభ కథల పోటీల్లో తృతీయ స్థానం సాధించింది. అందరూ ఎదగాలనే అంశంపై కౌస్తుభ చెప్పిన కథ న్యాయనిర్ణేతలను ఎంతగానో ఆకట్టుకుంది. తృతీయ స్థానం సాధించిన విద్యార్థినిని హెచ్ఎం ఆకెళ్ల బుజ్జి, ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, ఎంఈవో ఎస్.దుర్గాదేవి, సర్పంచ్ చొల్లంగి శివాళిని అప్పాజీ, ఉపసర్పంచ్ ఉర్రింక బుజ్జి, శ్రీపాద సూర్యనారాయణమూర్తి అభినందించారు.

గోవాను తలపిస్తున్న ఎస్.యానాం

చాజా, వాలీబాల్ కోచ్, సౌత్ సెంట్రల్ రైల్వే



ఉప్పలగుప్తం, డిసెంబరుర 29(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం బీచ్‌ను ఆంధ్రా గోవాగా సౌత్ సెంట్రల్ రైల్వే బీచ్‌వాలీబాల్ కోచ్ చాజా పోల్చారు. ఎస్.యానాం బీచ్‌లో ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. వైట్ శాండ్ బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంతో అనువుగా ఉందన్నారు. ఇక్కడకు వచ్చేందుకు నిజానికి తాను సందేహించానని ఇక్కడకు వచ్చాక విశాలమైన వైట్ శాండ్ బీచ్‌లో ఆట దేశంలోని ఇతర బీచ్ ప్రదేశాల కంటే పోటీలకు అన్ని విధాలా అనుకూలంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఎస్.యానాం బీచ్ జాతీయ గుర్తింపు సాధిస్తుందన్నారు. ప్రతి ఏటా పోటీలకు వచ్చేందుకు నిర్వాహకులు తమ జట్టుకు అవకాశం కల్పించాలని ఆమె కోరారు.

టీడీపీ సభ్యత్వాలు గడువులోపు పూర్తిచేయాలి

ముమ్మిడివరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గడువులోపులో లక్ష్యాలను సాధించి అధిక సంఖ్యలో పార్టీ సభ్యత్వాలు నమోదు చేయాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ 16, 17, 19 వార్డుల్లో ఆదివారం టీడీపీ పార్టీ సభ్యత్వాల నమోదులో ఆయన పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వాల నమోదులో చురుకైన పాత్రను పోషించి అధిక సంఖ్యలో పార్టీ సభ్యత్వాలు నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో దొమ్మేటి రమణకుమార్, దాట్ల బాబు, నిమ్మకాయల విస్సు, గెద్దాడ మురళీ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాల నమోదును వేగవంతం చేయాలి

మామిడికుదురు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ నామన రాంబాబు సూచించారు. ఆదివారం మగటపల్లిలో జరిగిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని సభ్యత్వాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. టీడీపీ సానుభూతిపరులకు, కార్యకర్తలకు సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించి కొత్తవారికి సభ్యత్వాలు అందించారు. కార్యక్రమంలో కుంచే శ్రీను, నామన నాన్నారు తదితరులు పాల్గొన్నారు.

రెండు మోటార్లు చోరీ

అల్లవరం, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): అల్లవరంహైస్కూల్ సెంటర్‌లో ఇళ్ళ అర్జునరావుకు చెందిన వెల్డింగ్ షాపులో శనివారం రాత్రి రెండు విద్యుత్‌మోటార్లు చోరీకి గురయ్యాయి. రూ.30వేలు విలువైన వేరే రైతుకు చెందిన విద్యుత్‌మోటార్లు చోరీకి గురయ్యాయని అర్జునరావు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కేశనపల్లిలో గోవుల అందాల పోటీలు

మలికిపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కేశనపల్లిలో జనవరి 3,4,5 తేదీల్లో రాష్ట్రస్థాయి ఒంగోలు, పుంగనూరు, గిరి ఆవుల అందాల పోటీలు నిర్వహిస్తున్నట్టు అడబాల లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. వీటితో పాటు ఒంగోలు ఆవుల పాల పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. గోప్రేమికులు గోసమ్మేళనం ఆధ్వర్యంలో నిర్వహించే ఈపోటీల్లో పాల్గొనాలని కోరారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

మలికిపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మట్టపర్రు గ్రామానికి చెందిన తాడి రాంబాబు(53) కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్యం తగ్గకపోవడంతో ఈనెల27న తన పొలంలో పురుగుల మందు తాగాడు. విషయం తెలిసిన భార్య కుమారుడు రాజోలు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారంరాత్రి మృతిచెందాడు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.

వైభవంగా శ్రీసత్యదేవుని దివ్యకల్యాణం



అమలాపురం టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): లోకాసమస్త సుఖినోభవంతు ఆధ్యాత్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్‌శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో అమలాపురం శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో ఆదివారం లోకకల్యాణార్థం శ్రీఅనంతలక్ష్మి సత్యవతిదేవి సమేత శ్రీవీరవెంకటసత్యనారాయణమూర్తి స్వామివారి దివ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. యజ్ఞోపవీతధారణ, స్వామివారు అమ్మవార్ల శిరస్సున బెల్లం, జీలకర్ర ఉంచి వేద పురోహితులు కల్యాణం జరిపించిన సమయంలో భక్తులు గోవింద నామస్మరణలు మిన్నంటాయి. మంగళసూత్రధారణ, తలంబ్రాల ఘట్టాన్ని తిలకించి ఆనంద పరవశులయ్యారు. ఉచితంగా భక్తులతో నిర్వహింపచేసిన కల్యాణ క్రతువులో వందలాది మంది దంపతులు పాల్గొన్నారు. శ్రీఅన్నపూర్ణేశ్వరి ఆరాధన అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. డాక్టర్ గోదశి గంగరాజు, డాక్టర్ జి.ప్రభాకర్, జి.సీతారామం, రామేశ్వరపు మణికంఠశర్మ, టీఎస్సార్ ఆంజనేయులు, మట్ట రామయ్య, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

హక్కుల బాటసారి మాధవరావుకు నివాళి

మలికిపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మానవహక్కుల వేదిక తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు మృతి హక్కుల ఉద్యమానికి తీరని లోటని మానవ హక్కుల వేదిక నాయకుడు ముత్యాల శ్రీనివాసరావు అన్నారు. విశ్వేశ్వరాయపురం అంబేడ్కర్ భవన్ వద్ద మానవహక్కుల వేదిక ప్రజా సంఘాలు ఘన నివాళులర్పించాయి. మాధవరావు విద్యార్థి దశ నుంచి పౌర హక్కుల ఉద్యమాల్లో పాల్గొని ఎన్నో పోరాటాలు చేశారని ఆయన అన్నారు. కార్యక్రమంలో జనిపల్లి నాని, చవ్వాకుల వెంకట్, నల్లి ప్రసాద్, మందపాటి సత్యనారాయణ, చింతా సత్య తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు బెల్ట్‌గ్రేడింగ్ టెస్టులు

అంబాజీపేట, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి):స్థానిక జిల్లాపరిషత్ క్రీడాప్రాంగణంలో తైక్వాండో క్రీడాకారులకు బెల్ట్‌గ్రేడింగ్ టెస్టులు తైక్వాండో జిల్లా ప్రధాన కార్యదర్శి పితాని త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తైక్వాండో ఉమ్మడిజిల్లా ప్రధాన కార్యదర్శి, బ్లాక్‌బెల్ట్ ఎగ్జామినర్ బి.అర్జునరావుపర్యవేక్షణలో జిల్లానుంచి 120మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎల్లో, ఎల్లో1, గ్రీన్,గ్రీన్1, బ్లూ,బ్లూ1, రెడ్‌బెల్ట్ గ్రేడింగ్ నిర్వహించారు.సీనియర్ కోచ్ కె.సత్యనారాయణ, జి.లక్ష్మీనారాయణ, బ్లాక్‌బెల్ట్ హోల్డర్ పితాని భార్గవిశ్రీకళ, పి.నాగభూషణం, పి.మణికంఠ, కె.రమేష్, భర్గేష్, సమర్నాధు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ ప్లాంట్ సందర్శన

మామిడికుదురు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కాదంబరి సుందరమ్మ జడ్పీ ఉన్నత పాఠశాల కడలి విద్యార్థినీ విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా నగరం ఓఎన్జీసీని ఆదివారం సందర్శించారు. ఓఎన్జీసీఅధికారులు, సాంకేతిక నిపుణులు విద్యార్థులకు పలుఅంశాలను వివరించారు. హెచ్ఎం ఎస్ఎస్ శర్మ, విద్యాకమిటీ చైర్మన్ ప్రకాశరావు, టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముమ్మిడివరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ట్రక్కు ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. అయినవిల్లి మండలం మాగాంకు చెందిన నక్కా సోమశేఖర్(32) ఆదివారం ఉదయం మోటారుసైకిల్‌పై అమలాపురం వైపు వెళుతుండగా ముమ్మిడివరం మండలం అనాతవరం వాటరు ప్లాంట్ వద్ద ట్రక్కు ఆటోఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సోమశేఖర్‌ను అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతిచెందాడు. అతడి భార్య అశ్విని ఉంది. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

పిచ్చికుక్కదాడిలో ఐదుగురికి తీవ్ర గాయాలు

అంబాజీపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఐదుగుర్ని తీవ్రంగా గాయపరిచింది. ఇసుకపూడిలో చింతా వాసు, పళ్ళ స్వామినాయుడుతో పాటు మరో ముగ్గుర్ని పిచ్చికుక్క తీవ్రంగా గాయపరిచింది. క్షతగాత్రులను అమలాపురం ఆసుపత్రికి తరలించారు.

రక్తపింజర్లు, తాచుపాము హల్‌చల్

అంబాజీపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు ఇళ్ల వద్ద హల్‌చల్ చేసిన రెండు రక్తపింజర్లు, ఒక తాచుపామును స్నేక్‌క్యాచర్ గణేష్ వర్మ పట్టుకున్నాడు. అంబాజీపేట రావులమ్మపానాటం సమీపంలోని బొంతు సాయి ఇంటి వద్ద రెండు రక్తపింజర్లు, ముక్కామల బీసీ కాలనీలో నగ్గ నాగేశ్వరరావు ఇంట్లో తాచుపామును పట్టుకుని డబ్బాలో బంధించారు. వీటిని దూరప్రాంతంలో విడిచిపెడతానని వర్మ తెలిపారు.

జొన్నాడ-మండపేట రోడ్డు పరిశీలన

ఆలమూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతు పనులు చురుకుగా జరుగుతున్నాయి. వీటి పరిశీలనలో భాగంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా జొన్నాడ-మండపేట రోడ్డును ఆదివారం ఆర్ అండ్ బి రాష్ట్ర చీఫ్ ఇంజనీరు నయీముల్లా పరిశీలించారు. జొన్నాడ నుంచి మండపేట వరకు గల రోడ్డును ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మరమ్మతు చేసిన ప్రాంతాల్లో రోడ్డు ఎత్తుగా ఉంటే సైడ్‌ఎడ్జిలు నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఎస్ఈ కాంతు, ఈఈ బి.రాము, డిప్యూటీ ఇంజనీరు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డును పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ నయీముల్లా

మునీశ్వరమ్మకు నివాళి

ఆలమూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ చైర్మన్ చల్లా మునీశ్వరమ్మ మృతికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నివాళులర్పించారు. ఆదివారం మునీశ్వరమ్మ కుటుంబ సభ్యులు ప్రభాకరరావు, నానాజీ, భూషణంలను ఆయన పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కెవీ సత్యనారాయణ రెడ్డి తదితర నాయకులు పరామర్శించారు.


మునీశ్వరమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు

ద్వారపూడిలో డ్రైన్‌ల పనుల పరిశీలన


ద్వారపూడిలో డ్రైన్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, డిసెంబరు, 29(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి పంచాయతీ పరిధిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. వంద రోజుల పండుగలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైన్, కమ్యూనిటీ హాల్ పనులు నాణ్యతతో చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ద్వారపూడిలో జరుగుతున్న పనులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల వైస్ ఎంపీపీ వెంకట రమణ, మండల అధ్యక్షుడు వై.బాబ్జి, గ్రామ అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, జి.వుల్లయ్య, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా దొరబాబు, టి.చంద్రశేఖర్ తదితరులు వున్నారు.

ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ: పట్టణంతోపాటు, ద్వారపూడిలో ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ పలు కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పట్టణంలో 3వ వార్డుకు చెందిన శీలం అప్పారావు, తాపేశ్వరంలో పుట్టా వెంకట్రావు, ద్వారపూడిలో సత్తింశెట్టి సాగర్, కోమలి పుల్లయ్య కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. వారి వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు వున్నారు.

రోడ్డు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

కొత్తపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): వాడపాలెం గ్రామంలో జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులను ఆదివారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరిశీలించారు. పంచాయతీ ఆవరణలో ఉన్న చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు, దానికి అనుబంధంగా వీలుగా ఉండేందుకు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ త్సామా బాబు, టీడీపీ నాయకులు పప్పుల కొత్తయ్య, బండారు రాజేష్, కడియం చిన్న, నరహరశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు



సెల్ టవర్ నిర్మాణం వద్దంటూ నిరసన తెలుపుతున్న మహిళలు

ఇళ్ల మధ్య సెల్ టవర్ వద్దంటూ మహిళల నిరసన

రావులపాలెం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్య సెల్ టవర్ చేపట్టడంతో దాని రేడియేషన్ కారణంగా రోగాల బారిన పడతామంటూ ఆ ప్రాంత మహిళలు నిరసన తెలిపారు. రావులపాలెంలోని లయన్ వెంకటరెడ్డి విలాస్ వద్ద భవనంపై చేపట్టే సెల్ టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ మహిళలు ఆదివారం నిరసన చేపట్టారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు సెల్ టవర్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలంటూ వినతిపత్రాలు అందించినట్టు తెలిపారు.

హైందవ శంఖారావం సభకు తరలిరావాలి


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర పతాధికారి రామకృష్ణారెడ్డి

రావులపాలెం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడ సమీపంలో జనవరి 5న నిర్వహించే హైందవ శంఖరావం సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని బీజేపీ రాష్ట్ర పతాధికారి తమనంపూడి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సభకు పీఠాధిపతులు, మఠాధిపతులు, హైందవ ధార్మికకర్తలు పాల్గొంటారన్నారు.

హైందవ శంఖారావానికి పాదయాత్ర

రామచంద్రపురం(ద్రాక్షారామ): విజయవాడలో జనవరి 5న జరగనున్న హైందవ శంఖారావం సభకు రామచంద్రపురానికి చెందిన అడబాల దుర్గా ప్రసాద్ అల్లూరి సీతారామరాజు వేషధారణతో పాదయాత్రగా ఆదివారం బయలుదేరారు. పట్టణంలోని రాజగోపాల్ సెంటర్‌లో ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజలు జరిపి పాదయాత్ర ప్రారంభించారు. ఆర్ఎస్ఎస్ నాయకులు హనుమంతు, నేమాని శర్మ, బీజేపీ నాయకులు కె.హరిబాబు, పులిగడ్డ సురేష్, అక్కిరెడ్డి శ్రీను, పి.సూరిబాబు, ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


విజేతలుగా నిలిచిన మండపేట సంఘం కాలనీ ఎంపీపీ పాఠశాల విద్యార్థులు

క్రియా పండుగలో మండపేట విద్యార్థులు

మండపేట, డిసెంబరు, 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయుసీలో జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రియా పిల్లల పండుగలో వివిధ విభాగాల్లో పలు బహుమతులను గెలుచుకున్నారని ఉపాధ్యాయులు చిట్టూరి వెంకట శ్రీదర్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సంఘం కాలనీ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు బహుమతులను పొందటంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు.

గ్రీటింగ్స్ తయారీలో చిన్నారులకు శిక్షణ

ఆత్రేయపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి అనూష్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు గ్రీటింగ్ కార్డ్స్ తయారీలో శిక్షణ అందించారు. ఉత్తమ గ్రీటింగ్ కార్డ్స్ తయారు చేసిన చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్యామ్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.


గ్రీటింగ్స్ చూపిస్తున్న చిన్నారులు

నిరుపయోగంగా రైతు సేవా కేంద్రాలు

- రూ.23.4 లక్షలతో ఒక్కో సేవా కేంద్రం నిర్మాణం
- చిన్నపాటి పనులు మిగిలిపోవడంతో నిరుపయోగంగా మారిన వైనం



కుందూరులో పూర్తయిన రైతు సేవా కేంద్రం

కె.గంగవరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): లక్షల ప్రజాధనం పోసి నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వం ప్రతిష్టకు పోయి అవసరం ఉన్నా లేకున్నా వారి మాట నెగ్గించుకోవడానికి భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసి, నిర్మాణాలు మొదలుపెట్టారు. చివరకు చిన్నపాటి పనులు మిగిలిపోగా వాటిని వృధాగా వదిలేశారు. దీంతో అవి దుమ్ము, దూళితో కళావిహీనంగా మారుతూ వృధాగా పడి ఉంటున్నాయి. గత ప్రభుత్వం కె.గంగవరం మండలంలో 22 సచివాలయాలు ఏర్పాటు చేసింది. వీటిలో రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) నిర్మించడానికి అనుమతుల మంజూరు చేసింది. సత్యవాడ, పాణింగపల్లి, అద్దంపల్లి, బాలాంత్రం గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి చేసుకుని వాడుకలోకి తీసుకువచ్చారు. అముజూరు, కుందూరు గ్రామాల్లో భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి. హడావిడిగా ప్రారంభాలు చేశారు. విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో అవి వినియోగంలో లేకుండా పోయాయి. కూళ్ల, యండగండి, మసకపల్లి గ్రామాల్లో టైల్స్ ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం వంటి చిన్నపాటి కారణాలతో వాటిని నిరుపయోగంగా వదిలేశారు. ఈ భవనాలను వాడుకలోకి తీసుకువచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


అముజూరులో పూర్తయిన రైతు సేవా కేంద్రం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): 11కేవీ విద్యుత్‌లైన్ల మరమ్మతుల పనుల్లో భాగంగా మోడేకుర్రు, గొలకోటివారిపాలెం గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.


మాట్లాడుతున్న సోమసుందర్

దోపిడీ, మతోన్మాదంపై పోరాటం చేయాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): దోపిడీ, మతోన్మాద శక్తులపై నిరంతరం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ నాయకుడు, సీనియర్ పాత్రికేయులు డి.సోమసుందర్ అన్నారు. సీపీఐ శత ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీపీఐ చరిత్రపై వి.గోపాలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సోమసుందర్ ప్రధానవక్తగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా ప్రజానాట్య మండలి, ఇతర ప్రజా సంఘాలు కలిపి ఏర్పాటు చేసిన పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు జె.ఏసురాజు, ఏఐటీ యుసీ నాయకులు వడ్డాదిరాజు, ప్రజా సంఘాల నాయకులు, సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.


రోడ్డు మరమ్మతులు పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ ఏఈ రమణ

రోడ్డు మరమ్మతు పనులు పరిశీలించిన అధికారులు

రాయవరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాయవరం-చింతపల్లి రోడ్డు మరమ్మతు పనులను ఆదివారం ఆర్‌అండ్‌బీ రామచంద్రపురం ఏఈ రమణ పరిశీలించారు. రాయవరం-చింతపల్లి రోడ్డులో అత్యవసర మరమ్మతుల కింద రూ.8లక్షలు మంజూరుకాగా వీటి పనుల్లో నాణ్యత పాటిస్తున్నారా అనే విషయాన్ని పరిశీలించారు. మరమ్మతు పనుల్లో మెటల్ క్వాలిటీని వారు పరిశీలించారు.


విద్యాధర్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఆలమూరు విద్యార్థికి సత్కారం

ఆలమూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆలమూరు విద్యార్థి అద్దరి సాయి విద్యాధర్‌ను పలువురు సత్కరించారు. జేఈఈ మెయిన్స్ అడ్వాన్సుల్లో ప్రతిభ కనబర్చడంతో పలువురు అభినందిస్తూ ప్రశంసా పత్రంతోపాటు రూ.10వేల నగదు అందించారు.

వైభవంగా శ్రీసత్యదేవుడి దివ్య కల్యాణం

అమలాపురం టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): లోకాసమస్త సుఖినోభవంతు ఆధ్యాత్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్‌శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో అమలాపురం శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో ఆదివారం లోకకల్యాణార్థం శ్రీఅనంతలక్ష్మి సత్యవతిదేవి సమేత శ్రీ వీరవెంకటసత్యనారాయణమూర్తి స్వామివారి దివ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. యజ్ఞోపవీతధారణ, స్వామివారు అమ్మవార్ల శిరస్సున బెల్లం, జీలకర్ర ఉంచి వేద పురోహితులు కల్యాణం జరిపించిన సమయంలో భక్తులు గోవింద నామస్మరణలు మిన్నంటాయి. మంగళసూత్రధారణ, తలంబ్రాల ఘట్టాన్ని తిలకించి ఆనంద పరవశులయ్యారు. ఉచితంగా భక్తులతో నిర్వహింప చేసిన కల్యాణ క్రతువులో వందలాది మంది దంపతులు పాల్గొన్నారు. శ్రీఅన్నపూర్ణేశ్వరి ఆరాధన అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. డాక్టర్ గోదశి గంగరాజు, డాక్టర్ జి.ప్రభాకర్, జి.సీతారామం, రామేశ్వరపు మణికంఠశర్మ, టీఎస్సార్ ఆంజనేయులు, మట్ట రామయ్య, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న దృశ్యం

వాడపల్లి ఆలయంలో భక్తజన సందడి

ఆత్రేయపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే స్వామివారికి తీర్థపు బిందెతో గోదావరి జలాలను తీసుకువచ్చి స్నపన మూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై వేదపారాయణం నిర్వహించారు. నోము ఆచరించిన పలువురు భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.4.77 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘం పీఆర్‌టీయు 2025 క్యాలెండర్, డైరీలను ఆదివారం మంత్రి సుభాష్ ఆవిష్కరించారు. రామచంద్రపురంలో మంత్రి గృహంలో పీఆర్‌టీయు యూనియన్ నాయకుల సమక్షంలో వాటిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అమృతరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఓదూరి వెంకటరమణ, కె.గంగవరం, రామచంద్రపురం, కపిలేశ్వరపురం, రాయవరం పి.గన్నవరం మండలాల అధ్యక్షులు డి.డమరుకనాథం, నాళం శ్రీనివాసరావు, కడియాల గోవిందరాజు, మేడిశెట్టి సత్యనారాయణ, సయ్యద్‌లిఖిత్ ఆలీ, పలువురు ఉపా ధ్యాయులు పాల్గొన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని 30 శాతం ఐఆర్ ప్రకటించాలని మంత్రికి వినతి పత్రం ఇచ్చారు.


పీఆర్‌టీయు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్, నాయకులు

రామచంద్రపురం(ద్రాక్షారామ): సీఎం సహాయ నిధి నుంచి ముగ్గురికి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన ఆర్థికసాయం చెక్కులను మంత్రి ఆదివారం పంపిణీ చేశారు. రామచంద్రపురం మండలం వెలంపాలెం గ్రామానికి చెందిన పురంశెట్టి బీమేశ్వరరావుకు రూ.1.40 లక్షలు, ద్రాక్షారామకు చెందిన ఎస్.వెంకటపద్మావతికి రూ.40 వేలు, రామచంద్రపురం పట్టణం గంగుమల్ల వీధికి చెందిన వడిసిలేటి వీరవెంకట సత్యసాయి చైతన్యకు రూ.88,850 చెక్కులను వారికి అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

అవినీతి జరిగితే అరెస్టు చేయండి: ఎంపీ బోస్

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో తప్పులు జరిగితే, మంత్రి సుభాష్ కేసులుపెట్టి అరెస్టు చేసుకోవచ్చని ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ నాయకుడిగా తమ పార్టీ హయాంలో తప్పు జరిగితే పార్టీ దృష్టికి తీసుకువెళతామన్నారు. వెంకటాయపాలెంలో బీసీ మహిళా సర్పంచ్‌పై కేసు పెట్టే అధికారం ఏఈకి లేదన్నారు. బీసీ సామాజిక భవనంలో శెట్టిబలిజ కార్తీక వనసమారాధన జరిగిందని టీడీపీ నాయకుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు, మాజీ మంత్రి వేణు, వైసీపీ నాయకులు కార్తీక వనసమారాధనలో పాల్గొన్నామన్నారు. గ్రామంలో ఒక వివాహానికి తుఫాను కారణంగా బీసీ సామాజిక భవనం ఇస్తే కేసు నమోదు చేయడం సమంజసం కాదన్నారు. గ్రామీణ వాతావరణం కలుషితం చేయడం తగదన్నారు. మంత్రి సుభాష్ చర్చకు రావాలన్నారని ఎవరితోనైనా చర్చకు సిద్ధమేనని ఎంపీ తెలిపారు. సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి మాట్లాడుతూ రూ.20 వేలు తీసుకుని కల్యాణ మండపం ఇచ్చానని నిరూపిస్తే సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తానని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ అంబటి భవానీ పాల్గొన్నారు.


జన సైనికుడి కుటుంబానికి బీమా చెక్కును అందిస్తున్న మంత్రి మనోహర్

జనసైనికుడి కుటుంబానికి బీమా నగదు అందజేత

మండపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన జన సైనికుడు కె.వేంకటేష్ ప్రమాదవశాత్తు మరణించారు. దీంతో అతడికి మంజూరైన ఇన్సూరెన్స్ రూ.5లక్షల సాయాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం విజయవాడలో వారి కుటుంబ సభ్యులకు అందించారు. మండపేట మండలం కేశవరానికి చెందిన జన సైనికుడు ప్రమాదవశాత్తు మరణించగా వారి కుటుంబ సభ్యులకు రూ.5లక్షల బీమా చెక్కును అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, ఉండమట్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముమ్మిడివరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ట్రక్కు ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. అయినవిల్లి మండలం మాగాంకు చెందిన నక్కా సోమశేఖర్(32) ఆదివారం ఉదయం మోటారుసైకిల్‌పై అమలాపురం వైపు వెళుతుండగా ముమ్మిడివరం మండలం అనాతవరం వాటరు ప్లాంట్ వద్ద ట్రక్కు ఆటోఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సోమశేఖర్‌ను అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతిచెందాడు. అతడి భార్య అశ్విని ఉంది. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

అంబాజీపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఐదుగుర్ని తీవ్రంగా గాయపరిచింది. ఇసుకపూడిలో చింతా వాసు, పళ్ళ స్వామినాయుడుతో పాటు మరో ముగ్గుర్ని పిచ్చికుక్క తీవ్రంగా గాయపరిచింది. క్షతగాత్రులను అమలాపురం ఆసుపత్రికి తరలించారు.

పరశురామ అవతారంలో వేంకటేశ్వరస్వామి


ప్రత్యేక అలంకరణలోనున్న వేంకటేశ్వరస్వామి

రాయవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 45 వ దశావతార ఉత్సవాలను పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి పరశురామ అవతారంలో అలంకరించారు. ఆలయ అర్చకుడు అంగర బాబు, పెద్దింటి కృష్ణమాచార్యులు అర్చకత్వంలో స్వామివారికి వేకువజామున తిరుప్పావై పారాయణం, స్వామి, అమ్మవారికి వెండి పుష్పాలతో పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన జరిపారు. రాయవరం, వి.సావరం, లొల్ల పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరం పేరుతో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

రాయవరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తప్పవని రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అర్ధరాత్రి రోడ్లపై కేకులు కట్ చేయడం, బైక్ సైలెన్సర్ తీసి నడపడం వంటివి చేస్తే చర్యలు తప్పవన్నారు. మండలంలోని ప్రధాన కూడళ్లలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

నూతన సంవత్సర వేడుకలకు దూరం

మండపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కామన ప్రభాకరరావు నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉంటున్నట్టు తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి నేపథ్యంలో దూరంగా ఉంటున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు తనను కలవవద్దని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆత్రేయపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముమ్మిడివరం గ్రామానికి చెందిన గ్రంధి షణ్ముఖ వీరవెంకటరమణ(18) ఆత్రేయపురం మండలం పులిదిండి ఇసుక ర్యాంపులో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఇసుక ర్యాంపు నుంచి పనులు ముగించుకుని మిత్రుడు సత్యనారాయణతో కలిసి బైక్‌పై ముమ్మిడివరం వెళుతున్నారు. ఈ నేపథ్యంలో లొల్ల గ్రామ సమీపంలో ఆర్‌అండ్‌బి రహదారిపై వస్తున్న ట్రాక్టర్ వారిని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.


బంగారు తాపడంతో కొలువుదీరిన స్వామివారు

వెంకన్నకు బంగారు ఆభరణాల తాపడం

రావులపాలెం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి బంగారు ఆభరణాల తాపడం అలంకరించారు. 180 గ్రామాల బంగారంతో చేయించిన స్వామివారి పాదాలు, వృక్షస్థలం, కిరీటం, శంఖుచక్రాలు, కర్ణపత్రాలు, సూర్యకటారి, లక్ష్మీదేవితో చేయించిన తాపడాన్ని స్వామివారికి అలంకరించి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త పడాల పెదవెంకటరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో అర్చకులు ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాద్, కమలనాథ్ శర్మ బృందం ఆభరణాలకు సంప్రోక్షణ, అష్టోత్తర కలశాభిషేకం చేసి స్వామివారి మూలవిరాట్‌కు అలంకరించారు.


పోస్టల్ ఉద్యోగిని సత్కరిస్తున్న దృశ్యం

కొండపల్లికి సత్కారం

మండపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండపేట పోస్టల్ శాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్న కొండపల్లి సూర్య నారాయణ సేవలను గుర్తించి పట్టణంలోని గొల్లపుంత కాలనీకి చెందిన జెహెచ్ఎస్ సంఘీయులు ఆదివారం సత్కరించారు. ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ ఎం.శ్యాముల్, మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి తదితరులు ఆయన్ను సత్కరించారు.